క్లుప్తంగా

ఘనంగా నగర సంకీర్తన



మాచర్ల: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలో తెల్లవారుజామున 5గంటల నుంచి నగర సంకీర్తన కార్యక్రమాన్ని భారీ స్థాయిలో పట్టణంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ సభ్యులు, మహిళల ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహించారు. అందులో భాగంగా నూతన సంవత్సరం పురస్కరించుకొని తెల్లవారుజామునే అర్చకులు, సభ్యులు వీరాంజనేయరెడ్డి, కోటిరెడ్డి, చెన్నకేశవరావు, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో మహిళలు స్వామి వారికి హారతులిస్తూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎస్సీ కాలనీలో బోరుబావి ఏర్పాటు



వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి బోరుబావిని ప్రారంభించి మాట్లాడారు. శిరిగిరిపాడు ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన పీఆర్కే వెంటనే ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోరు బావిని మంజూరు చేశారన్నారు. దీంతో కాలనీవాసుల తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అట్లూరి లక్ష్మారెడ్డి, లింగాల రాఘవాచారి, గాలి మరియదాసు, దుబ్బా సియోను, గట్ల మల్లిఖార్జున రెడ్డి, దమ్ము శంకర్, వెంకటేశ్వర్లు, కిట్టయ్య, చిన్నా, గురవయ్య, నాగరాజు, దిరిసినాల చిన లాల్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు పిన్నెల్లిలో జగనన్న సురక్ష

మాచవరం : మండలంలోని పిన్నెల్లి గ్రామంలోని సచివాలయం 1లో జగనన్న సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



నకరికల్లు: ట్రాక్టర్ కింద పడి గాయాలపాలైన వృద్ధుడు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కుంభా సాంబయ్య(67) ట్రాక్టర్‌పై డ్రైవర్‌కు కుడివైపున ఇంజిన్‌పై కూర్చొని ప్రయాణిస్తున్నాడు. డ్రైవర్ అతివేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో అదుపుతప్పి ట్రాక్టర్ కిందపడ్డాడు. ట్రాక్టర్ టైర్ల కిందపడడంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలిస్తుండగా పెదకాకాని వద్ద మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు కుంభా సాంబయ్య కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ సోమవారం తెలిపారు.

నవనీత అలంకరణలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదు లాంతర్ల సెంటర్‌లోని శ్రీ రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి వెన్నతో (నవనీతం) అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

క్రీస్తును కీర్తిస్తూ ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రభుత్వ విప్ పీఆర్కేతో కేక్ కట్ చేయిస్తున్న కారెంపూడి మండల పార్టీ నాయకులు

కారెంపూడి: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు సిబ్బందితో కలసి వేడుకలు జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు మాచర్ల తరలివెళ్లి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి పీఆర్కేను ఘనంగా సన్మానించారు. భారీ కేక్‌ను ప్రభుత్వ విప్ పీఆర్కేతో కట్ చేయించి వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అక్బర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ బొమ్మిన అల్లయ్యసావిత్రి, సర్పంచ్ ప్రమీలాభాయి తేజానాయక్, వివిధ హోదాల పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభిమానులు వేడుకలలో పాల్గొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా సీఐ జయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గురజాల : నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఆనందంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరం వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కటింగ్‌లు, బాణ సంచా మోతలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మహిళలు లోగిళ్ల ముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన రంగవల్లికలు చూపరులను ఆకట్టుకున్నాయి. పండ్లు, స్వీట్ షాపులు కళకళలాడాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేవాలయాలను ఆయా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రెవెన్యూ డివిజనల్ అధికారి రమణాకాంత్ రెడ్డిని డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్యలను, నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్‌లను పలువురు ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి వర్యులు కాసు వెంకటకృష్ణారెడ్డిలను పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి వారి కార్యాలయాల్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీస్తును ఆరాధించాలి

దాచేపల్లి : ప్రతి ఒక్కరు మారుమనస్సు పొంది క్రీస్తును ఆరాధించాలని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ అన్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం అర్ధరాత్రి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌లను కట్ చేశారు. నూతన సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని ఆయన చెప్పారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, తహసీల్దార్ జీ కరుణకుమార్, సీఐ సురేంద్రబాబు, ఎస్ఐలు సంధ్యారాణి, శివనాగేశ్వరరావు, ఎంపీడీవో శోభారాణి, కమిషనర్ సత్యనారాయణ తదితరులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

రెంటచింతల: నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించేలా మరియమాత తన చల్లని ఆశీస్సులు అందజేయాలని స్థానిక సాగర్‌మాతా జూనియర్, విజిడమ్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ రెవ. కొణతం ఎలిసారాజు అన్నారు. మరియమాతృత్వ పండుగ మహోత్సవం, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కానుకమాతా చర్చి ఆవరణలో విచారణ గురువులు యేరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి మాట్లాడారు. దేవుని కుమారుడు ఏసు నామకరణం చేసిన సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా జనవరి 1న మరియమాతృత్వ పండుగ మహోత్సవం ఘనంగా జరుపుకుంటారన్నారు. లోక రక్షకుడు ఏసు మాతృమూర్తి మరియమ్మ ఆదర్శ జీవితం క్రైస్తవులందరికీ మార్గదర్శకమన్నారు. బాణ సంచాతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



క్యాండిల్ సర్వీస్ నిర్వహిస్తున్న దృశ్యం



కాకంగిమాతా చర్చి ఆవరణలో పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిని నిర్వహిస్తున్న ఫాదర్లు

మాచర్లలో నూతన సంవత్సర వేడుకలు

మాచర్ల: పట్టణంలోని ఆయా చర్చిల్లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని 70 చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల అంజయ్య ఆధ్వర్యంలో, అదే విధంగా తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి రెవ.రవికుమార్, కౌన్సిలర్ మాచర్ల సుందరరావు, సొసైటీ కాలనీలో ది లెమెన్ ఇవాంజలికల్ చర్చి, ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రాయపరెడ్డి, 20వ వార్డులోని బేతేలు మందిరంలో జాన్ వెస్లి, 10వ వార్డులోని జీబీపీఎఫ్ చర్చి పాస్టర్ బ్రహ్మానాయుడు, మరనాత చర్చి, సాగర్ రోడ్డులోని ది లెమెన్స్ చర్చి, పెంతెకోస్తు, 24వ వార్డులో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెరిన్ కాలనీలో పాస్టర్ వేల్పుల దానియేలు, వినాయకుని గుట్టలో పాస్టర్ వేల్పుల గురవయ్య, 9వ వార్డులోని చర్చిలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్, వార్డు కౌన్సిలర్ మందా సంతోష్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిపారు. కేక్‌లు కట్ చేసి క్రీస్తును కీర్తిస్తూ, ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసును స్తుతిస్తూ నూతన సంవత్సరాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు



ఊరేగింపుగా లడ్డూను తీసుకొస్తున్న ఆలయ అధ్యక్షులు అంచూరి శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న అయ్యప్ప దేవాలయం, శ్రీనివాస్ నగర్‌లోని సాయిబాబా దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆలయ ప్రధానార్చకులు వీకే సతీష్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహాగణపతి హోమం, పంచామృతాభిషేకం, నవవిధాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో 29కేజీల లడ్డూ మహాప్రసాదానికి వేలంపాట నిర్వహించగా యడ్లపల్లి సత్యనారాయణ రూ.19 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఆటంకం కలగకుండా మోర్జంపాడు సేవా సమితి వారు ప్రత్యేక సేవలు నిర్వహించారు. లడ్డూను ఆలయ ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, అంచూరి శ్రీనివాసరెడ్డిలు సత్యనారాయణకు అందజేశారు. ఆలయ ప్రధాన కార్యదర్శి ఉటుకూరి సీతరామాంజనేయులు, కాకుమాను రమేష్‌బాబు, యడ్లపల్లి వెంకట సుబ్బారావు, బండి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు గోపాలరావు, గుండా మణికంఠ కుమార్, మెంబర్లు కట్టమూరి వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



వెల్దుర్తిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వెల్దుర్తి వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు క్యాలెండర్‌లను తయారు చేయించి కార్యకర్తలకు అందించటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పీఆర్కేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీపీ చింతా శివరామయ్య, బూడిద శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఊరబండి మన్నెయ్య, పంగా కాశయ్య, పులుసు నారాయణ రెడ్డి, చింతా ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి, చింతా శ్రీనివాసరావు, సాని కోటేశ్వరరావు తదితరులున్నారు.

ఆలయాల్లో నూతన సంవత్సర పూజలు

మాచర్ల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వర స్వామి, పాత మాచర్లలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయం, వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు, గంగా పార్వతి నగరేశ్వర స్వామి, శ్రీశైలం రోడ్డులోని అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామి దేవాలయాలలో అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

పది సంవత్సరాలుగా ప్రతి ఏడాది రాష్ట్ర యువజన విభాగ కార్యవర్గ సభ్యుడు ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందిస్తున్నారు. సోమవారం 3వేల క్యాలెండర్‌లను పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ విధంగా వైఎస్సార్‌సీపీ అభిమానులకు క్యాలెండర్లు అందించే ఉమామహేశ్వరరెడ్డి కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెంటచింతల మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు పలువురు పాల్గొన్నారు.

పెద్దల సమక్షంలో ప్రేమవివాహం



గ్రామపెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమికులు

అచ్చంపేట: ఏడాదిగా కొనసాగుతున్న ప్రేమికుల ప్రేమాయణం ఎట్టకేలకు సఫలీకృతమైంది. గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం రాత్రి ఇద్దరూ ఒక్కటయ్యారు. మండలంలోని కొండూరు గ్రామం, బీసీ కులానికి చెందిన చొప్పరపు శ్రీనివాసరావు, అదే గ్రామం ఎస్సీ కులానికి చెందిన సుంకిశాల దీపిక గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలిసి కట్టడి చేశారు. అయినా వారి ప్రేమాయణం ఎంతమాత్రం తగ్గలేదు. ఒకరిపై ఒకరు మరింత ఇష్టం పెంచుకున్నారు. పెద్దలను ఒప్పించిన తరువాతే వివాహం చేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఇరువురు ఏడాదిగా వారి వారి పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేశారు. గ్రామ పెద్దలు కల్పించుకుని శ్రీనివాసరావు తండ్రి స్వామి, దీపిక తండ్రి ఏసురత్నంలతో సంప్రదించి ఒప్పించారు. ఆదివారం రాత్రి ఇరువురి బంధువుల సమక్షంలో గ్రామంలోని చర్చిలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిపించారు. ప్రేమికులు ఇరువురు మేజర్లు కావడంతో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా వివాహం సజావుగా జరిగింది. కార్యక్రమంలో వరుని తరుపు గణపవరపు రామమూర్తి, బలరాజు సైదరాజు, చొప్పరపు శ్రీను, యేళ్ల ఆంజనేయులు, వధువు తరుపు ఆనంద్‌కుమార్, నవనీతరావు తదితరులు హాజరయ్యారు. మరికొంతమంది గ్రామ పెద్దల సమక్షంలో ఇరువురు దండలు మార్చుకుని ఒక్కటయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని బసికాపురం గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలూరిపేట మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తూ బసికాపురం గ్రామం వద్ద రోడ్డుపై నిలబెట్టిన ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో బాలినేని వెంకటేష్(25) మృతిచెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం 2024 నూతన సంవత్సర వేడుకలు ఎమ్మెల్యే కాసు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్‌చేసి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మాజీ ఆర్‌టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాసరావులకు కేక్ తినిపించి వారితోపాటు ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్న సంకల్పంతో సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలబడి అఖండ మెజార్టీతో మరలా ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సంక్షేమ పాలనను అందిస్తున్న ప్రజానేతను రాష్ట్ర ప్రజలంతా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల పట్టణ, మండలంలోని, గురజాల పట్టణం, మండలం, దాచేపల్లి పట్టణం, మండలాలతోపాటు మాచవరం మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను ప్రజాప్రతినిధులు, అధికారులు దుశ్శాలువ, పూలమాలతో సన్మానించారు. పార్టీ కార్యాలయానికి హాజరైన ప్రతి ఒక్కరికి భోజన సౌకర్యం ఎమ్మెల్యే కల్పించారు.



నూతన సంవత్సర వేడుకలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

ఘనంగా పత్తి చెట్లలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవం



విప్పర్ల(క్రోసూరు): మండలంలోని విప్పర్ల గ్రామంలోని నిదానంపాటి పత్తిచెట్ల లక్ష్మీ అమ్మవారి 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సంతోషాలు నింపాలని ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు వివరాల మేరకు.. గణపవరం గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ బీరంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం రాత్రి రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. మేడికొండూరు మండలం దుర్గాపాలేనికి చెందిన షేక్ బషీర్ మిత్రుడితో కలిసి తన ద్విచక్రవాహనంపై వెళ్తూ.. శ్రీనివాసరావును ఢీకొన్నారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు కాలికి తీవ్రగాయం కాగా, 108 అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి

నరసరావుపేట టౌన్: ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. బరంపేట వినాయకుని గుడి వద్ద సుమారు 50 సంవత్సరాల వయస్సు గల మహిళ రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతిరాలి సమాచారం తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ భాస్కర్ తెలిపారు.

వృక్షాంజనేయస్వామికి విశేష పూజలు



నకరికల్లులోని వృక్షాంజనేయస్వామి

నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వృక్షాంజనేయస్వామి వారికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు తుంగతుర్తి పాండు రంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వయంభువుగా వెలసిన స్వామివారికి కుంకుమ, పసుపు, గంధం, పాలు, పెరుగు, నెయ్యి తదితర విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా భక్తసంఘం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలుప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.